# ★ ఉపదేశం ★

హృదయాన్ని కరగించి సామాజిక జీవితాని కళ్ల ఎదుట కల్పింపజేసే ఒక కమనీయ స్వప్న కథానిక.


— శ్రీ —
పిల్లలమఱ్ఱి
వేంకట హనుమంతరావు
(సాధనసమితి)


కలలు నాకు సామాన్యంగా రావు. వచ్చినా మేల్కొనే టప్పటికి ఎంత ప్రయత్నించినా జ్ఞప్తికి వచ్చేవి కావు. ఆరోజు వచ్చినకలను అదేమి చిత్రమోగాని మరచిపోలేకపొయ్యాను. కలలో కలిగిన ఆనందాన్ని గాని దుఃఖాన్నిగాని ఇతరులకు చెప్పితేనే మనస్సుకు తృప్తి. కనుక నేనుకూడా చెబుతున్నాను. మధ్యాహ్నం 3 గంటలకు మా సంఘసభలో 'స్త్రీలు వారి నాగరకత' అనే అంశాన్నిగూర్చి నే నుపన్యసిస్తూ వుండగా ఒక ముసలి బ్రాహ్మడు సభలోనుంచి నన్ను పిలిచాడు. పిలవంగానే సభవారి ఆజ్ఞ తీసుకుని వెళ్లాను. ఆ బ్రాహ్మడు నన్నొక నిర్జన ప్రదేశానికి తీసికెళ్లి అబ్బాయీ! నీ ఉపన్యాసం విన్నాను. స్త్రీ ప్రపంచం నీకు అపరిచితంలాగ వుంది. నామాట ప్రకారం చెయ్యి. నీకు తెలుస్తుంది! అన్నాడు. నే నాశ్చర్యంతో 'సరే' నన్నాను.

'తూర్పు తిరిగిచూడు. ఏం కనపడిందో చెప్పు'అన్నాడు. నా దృష్టిని ఆదిక్కుకే ప్రసరించాను.

ప్రశాంత వినీలాకాశంలో మినుకుమినుకుమనే నక్షత్రసమితి మధ్య రేరాజు. కొండచరియల్లోనుంచి, గులకరాళ్ల మీదుగా గలగలా ప్రవహిస్తున్న సెలయేళ్లు, కొండ సందుల్లోజనించి, క్రింద సెలయేళ్లలోకి వొంగి, వాటితో కలసిపోతూన్న లతల్లో కలవకండా అక్కడే నిలుచున్న మృదులతకూనలు, సెలయేళ్లతో కలసి పయనమైపోతూ కొన్ని గులకరాళ్లకూ, ముళ్లమండలకూ చిక్కుకుని చివికి నల్లబడిన తీవలు, సెలయేళ్లతో బడకండానే ప్రవాహాలదరిదాపుకు వచ్చి కూడా అట్టే ఆగిపోయి గట్లమీద నిలబడిన లతలు.

'అబ్బాయీ! నీవు చూస్తున్న ప్రవాహాలన్నీ ప్రపంచంలోని పురుషులు. లతలన్నీ స్త్రీలు. ఆ మృదులతకూనలు పసిపిల్లలు. సంసారసుఖమనుభవిస్తూ దుష్టుల దుండగములకు గురియైనవే ఆ నల్లబడిన తీవలు. సంసారసౌఖ్యమనుభవిద్దామని సంతోషంతో గట్లదాకా వచ్చి గులకరాళ్లను చూచీ, ముళ్లమండల్ని చూచీ కుమిలిపోతూన్నవారిని చూచీ, భయపడి సంసారంలోకి దిగనివే ఆగట్లమీద ఆగిపోయిన లతలు!' అన్నాడు ప్రక్కనేవున్న ఆ బ్రాహ్మడు. నేనట్లాగే వింటూ నిలబడ్డాను. 'పైన సంచరిస్తూన్న రేరాజును చూశావూ? అతడు నీకూ నాకూ నిర్మలంగా సంచరిస్తూ కనబడినప్పటికీ వివిధతావుల్లోవున్న ఆ లతలకు రకరకాల భావాలు కలుగజేస్తాడు. నువ్వు గమనించు ఇంకా,' అన్నాడు. అనంగానే నే నావేపు

భాషా నాకబ్బింది! ప్రవాహాల్లో కలసిపోతూన్న లతల్ని, రేరాజును చూశాను. ఆ లతలభావాల్ని గ్రహించే శక్తి నాక్కలిగింది! అవి స్తోత్రం చేస్తున్నాయి. రాళ్లల్లో మండల్లో చిక్కున్న తీగెలు రేరాజును దూషిస్తున్నాయి. గట్లమీద నిలచిపోయిన లతలు ఆ రేరాజు యేలుబడిలో వుండలేమని తహతహలాడుతున్నాయి. మృదు లతకూనలు ఆవెన్నెల్లో సుఖంగావుండి ఆడుకొంటున్నాయి. చూస్తూవుండగానే చల్లని గాలి మామీదుగా పోయి ఆతీవల్ని తాకింది. 'ఈ మారుతం లతల్లో ఎన్నిమార్పులు కలుగజేస్తుందో చూడు' అన్నాడు బ్రాహ్మడు 'ఏమిటీగాలి?' అన్నాను. ''ప్రపంచంలో 'నాగరకత'అని అంటారు దీన్ని!''అన్నాడు. ఈ గాలి వెళ్లి ఒక ప్రవాహంలోవున్న తీగెను వేరే ప్రవాహంలోకి నెట్టింది. గట్లమీదవున్న తీగెల్లో కల్లోలం కల్గించింది. ఆగాలి సహాయాన్ని స్వీకరించి కొన్ని ప్రవాహాల్లోకి దూకినై. మరికొన్ని వెనుదీసినై. జన్మస్థానంలో నిలచిపోయిన లతకూనలు చల్లగాలుల్లో ఆడుకుంటూ ఎట్టి సంచలనంలేకండా వున్నాయి. 'చూశావుగా నవనాగరకత! విడాకు లివ్వడం మొదలైన ఫ్యాషన్లు?' అన్నాడా బ్రాహ్మడు. 'ఆ లతల్లోకి జాగ్రత్తగా చూడు' అని రెట్టించాడు. చూశాను.

ఆ లతల్లో అక్కడక్కడ కొన్ని పూవులున్నాయి. అవి అనేక రంగుల్తో విరాజిల్లుతూవున్నాయి. ఎంతో అందంగావుండి ఆనందాన్ని చూరగొంటున్నాయి. ఆకుపచ్చ తీవల్లోనుంచి దోబూచులాడుతూ వున్నాయా ప్రసూనాలు. వాటిని నాకు తీసుకుందామనిపించింది. నా ఊహను గ్రహించే కాబోలు అతను 'తెంపబోకు. ఆ పూలకోసమే ఆ లతలంత అవస్థపడుతున్నాయి. లతలకు వాటిమీద ఎంతో ప్రేమ. ప్రవాహాల్తోకలసి పయనమౌతూన్న లతలకు ఫలితం ఆ ప్రసూనాలు. అవే సంతానం! ఈర్ష్యా ప్రపంచాన్ని చూట్టానికి వెరచి లతల్లోనే అణగియున్నై. తమ ఆనందాన్ని చుట్టూవున్న లతలక్కూడా పంచుదామన్న బయటికివచ్చిన కుసుమాలు భగ్నమనోరథలై నిలిచి నివ్వెరవోయి చూస్తున్నై. అబ్బాయీ! ఒకరి ఆనందానిని చూచి సహించలేదు ప్రపంచం!' అన్నాడు. ఆ లతల్లో గుసగుసల్ని విన్నా నాకావిధంగానే తట్టింది. వాటి భాష నాకలవడింది గనుక అవి అనుకుండే విషయాలు తెలుసుకున్నాను.

'కొండ సందుల్లోనే నిలిచిన లతలు ప్రవాహాల్లో కలవడానికి తగినపొడవు పొందినా అలా కలవకుండా వున్నాయనీ, కలవడానికని పోయి గట్లమీదే నిలబడిపోయిన వెందుకోయనీ, నల్లబడి రాళ్లల్లో చిక్కున్నవాటిని గూర్చి ప్రవాహాల దేమీ తప్పులేదు; ఆతీవల్దే తప్పు; తమతమ ప్రవాహాల్నివదలి వేరే ప్రవాహాల్తో కలసిపోదామని ప్రక్కకు తప్పుకొని రెంటికీ గాకుండా చెడిపోయినవనీ, ప్రవాహాల్తో కలసి పయనమౌతోన్న లతల్లో కొన్నింటిని ప్రవాహమధ్యలోనుంచి పోకుండా పక్కగుండా పోతున్నై అనీ, ఐక్యతాట్లే వున్నట్లు అగుపించదనీ, ప్రవాహమధ్యంగా పెనగిపోతూన్నా వాటికి ఫలం దక్కలేదనీ లతల్లో లతలు గుసగుసలు.'

'విన్నావా లతల రహస్యాల్ని? ఒకరి విషయం మన కెందుకని వూరుకోదు ప్రపంచం! ఒకరి కొకరికి సరిపడదు. ఈర్ష్య! ఇంతాజేస్తే సుఖంగావున్న లత లెన్నివున్నాయో చూశావా? లోపమునేది ప్రతి దానికీ వుంది. వున్నా తమ లోపాల్ని చూసుకోకండా ఇతరుల లోపాల్ని చూచి వెక్కిరిస్తాయి. వాటి మాటలు విన్నావు కాని ఇక వాటి చర్యలు పరికించు'అన్నాడు. వాటి మాటల్ని వినేటప్పటికి నా కేదో విధమైన అసహ్యం పుట్టింది. నా చిత్తవృత్తిని గ్రహించి అన్నాడా బ్రాహ్మడు 'చూశావుగా అబ్బాయి!

ప్రపంచమంతా ఇంతే! ఈ ప్రపంచంలో తలయొగ్గి తనదారిన పోయే వాడివికాదు రోజులు. అన్యాయము, కృత్రిమము, అమర్యాద, అసత్యము తనసొత్తుగా కలవారే మహామహులు. కాని పరలోకంలో వారికి స్థానమే శూన్యం! ఇట్టి ప్రపంచంలో నుంచి తప్పించుకునే మార్గం వేరేలేదు.'

ఈ మాటలు వినేటప్పటికి నాకు కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగినై. దీనంగా బ్రాహ్మణ్ణి చూస్తూ పరమావధి ఏమన్నట్లు మోకాళ్లమీద నిలుచున్నాను. పాపమతను నన్ను లేవనెత్తి 'ఆ ప్రవాహాలెటు పోతున్నవో చూడు' అన్నాడు. అవన్నీపోయి ఓపెద్ద సముద్రంలో కలసిపోయినై. ఆ లతలన్నీ వాటితో సహా ఆనీళ్లల్లోకలసి ఎటుపోయినవో! నిర్వర్ణించి చూశాను. కొన్ని ద్వీపాలు అగుపడ్డాయి. వాటిల్లో ఎవరో-దేవతల్లాగ వున్నారు. పూల పాన్పులపైన ఆడుకుంటున్నారు. ప్రక్కనేవున్న బ్రాహ్మడు 'అబ్బాయీ, ఆ ద్వీపాలే స్వర్గలోకం! దాంట్లో ఆడుకుంటూన్నవాళ్లే ప్రపంచంలో సుఖంగా సంసారయాత్ర సాగించి సత్ప్రవర్తనులై సంచరించిన మహానుభావులు!' 'అయితే ప్రపంచంలో అన్యాయ అసత్యప్రవర్తనులేమైనారు? వారి స్థాన మెక్కడ?' అన్నాను. జవాబు రాలేదు. ప్రక్కకు తిరిగి చూశాను. బ్రాహ్మడులేడు! ఆ ద్వీపాలవేపు చూశాను. అవీలేవు! ఇంతలో వులిక్కిపడిలేచాను. చూచుకుంటే నా పక్కమీద నే నున్నాను.

# విశ్రాంతి

మున్నెవ్వంగు రచింపనట్టి, రసికా మోదంబులౌ కావ్యముల్
మిన్నుల్ ముట్టగజేయు నీప్రతిభ .....ఏ మేమో సగర్వంబుగా
ఎన్నోఆశలు పల్లవించె అవి యెన్నేనిన్ నిరాశాశ్రులై
మన్నైపోయెను గాదె ఓ కలమ? ఈ మాత్రానికే మురిసితో?

ఏకఝురీ ప్రవాహమున ఎత్తిన హస్తము దింపనీక అ
స్తోకమహత్వ కావ్యరస స్ఫూర్తివహించెడి వృత్తిమాని నే
డీ కుటిలత్వమూని పలిటీలను గొట్టుచు అస్తమింపగా
నీ కవనమ్ము కీర్తి పయనించెను వెంటనె నాకవీధికిన్

మధురసభావ సూక్తి మటు మాయముజెందెను కావ్య కన్యకే
బధిరతగూర్చినావు తుది వందనమాయిది? తెల్గుసీమసీ
విధి క్షుభితాత్మజేసి, మము వీడిలు మింతలొ; ఆంధ్రవాఙ్మయో
దధినిమధించకే పరమ ధామము జేరితివేమి కర్మమో??

'ఎన్ని నూతన మంగళ కృతిసుమముల తెలుగు తల్లికి వడినంపదెత్తు' ననుచు
తలచుచుండగ నీమది వలచినట్లు శాశ్వతంబగు విశ్రాంతి సంభవించె.

—బూ. రం. రావు.